# చూడండీ దారుణం

- దళిత ఎమ్మెల్యేపై సర్కారు కక్ష
- తప్పుడు కేసుతో వేధింపు
- గవర్నరుకు చంద్రబాబు ఫిర్యాదు
- జోక్యం చేసుకోవాలని వినతి
- రాష్ట్రపతినీ కలుస్తామని వెల్లడి

హైదరాబాద్ - న్యూస్‌టుడే

ఎమ్మెల్యేలను నయానో, భయానో తన దారిలోకి తెచ్చుకోవడంద్వారా ప్రధాన ప్రతిపక్షాన్ని నిర్వీర్యం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెదేపా అధినేత చంద్రబాబు ధ్వజమెత్తారు. తన ఎత్తుగడలకు లొంగని ఎమ్మెల్యేలపై తప్పుడు కేసులు బనాయించి మానసికంగా వేధిస్తోందని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే కొవ్వూరు ఎమ్మెల్యే రామారావుపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తోందని, ఆయనను అరెస్టు చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోందని గురువారమిక్కడ గవర్నరు ఎన్.డి. తివారీకి చంద్రబాబు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే రామారావుపై పెట్టిన తప్పుడు కేసు విషయంలో రాజ్యాంగ పరిరక్షకుడిగా జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరారు. తెదేపా ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులతో కలిసి చంద్రబాబు గవర్నరుకు వినతిపత్రం సమర్పించారు. ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా, బాధితుల నుంచి ఫిర్యాదు లేకుండా రామారావుపై అత్యాచారం, హత్యానేరాల కింద కేసు నమోదు చేశారని, ఇంతకన్నా దారుణముంటుందా? అని కేసు విషయాన్ని గవర్నరు దృష్టికి చంద్రబాబు తీసుకెళ్లారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన పిల్లి డేవిడ్‌రాజు, 'సాక్షి' పత్రిక విలేకరి శ్యామలరావు, మరికొంతమంది కలిసి రామారావుపై అత్యాచారం, హత్య వదంతులు పుట్టించారని తెలిపారు. ఎవరో తనకు చెప్పారంటూ పిల్లి డేవిడ్ రాజు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారంటూ రామారావుపై పెట్టిన కేసు పూర్వాపరాలు, అనంతరం జరిగిన పరిణామాలను గవర్నరుకు వివరించారు. ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి 'ఆపరేషన్ ఆకర్ష' పేరుతో తమ పార్టీ ఎమ్మెల్యేలను ప్రలోభపెడుతున్నారని, వినకపోతే వేధింపులకు గురిచేస్తున్నారని, అప్పటికీ లొంగకపోతే ఇలా తప్పుడు కేసులు బనాయించి మానసికంగా బాధిస్తున్నారని చంద్రబాబు తెలిపారు. రామారావు కేసు విషయంలో ముఖ్యమంత్రి పేషీ నుంచే అపాయింట్‌మెంట్స్ ఇచ్చి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారని ఆరోపించారు.

## అరెస్టుచేస్తే తీవ్రపరిణామాలు

ఎమ్మెల్యే రామారావును అరెస్టు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ప్రభుత్వాన్ని చంద్రబాబు హెచ్చరించారు. గవర్నరును కలిసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. అవసరమైతే రామారావుపై పెట్టిన తప్పుడు కేసు గురించి రాష్ట్రపతి, స్పీకరు దృష్టికి తీసుకువెళ్లి జాతీయ స్థాయిలో పోరాడతామని చెప్పారు. ముఖ్యమంత్రి సిగ్గులేకుండా 'ఆపరేషన్ ఆకర్ష' పేరుతో ఏకంగా ఒక పోర్టుపోలియోనే ఏర్పాటు చేశారని మండిపడ్డారు. ఆదిలాబాద్ జిల్లాలో తెదేపా జడ్పీటీసీ సభ్యులు ఒక్కొక్కరికి రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షలదాకా ఇచ్చి కొన్నారని ఆరోపించారు. తెదేపా నేతలు అశోక్ గజపతిరాజు, నాగం జనార్దనరెడ్డి, గాలి ముద్దుకృష్ణమ నాయుడు, బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, దాడి వీరభద్రరావు, కోడెల శివప్రసాదరావు, మోత్కుపల్లి నర్సింహులు, రావుల చంద్రశేఖరరెడ్డి తదితరులు గవర్నరును కలిసిన వారిలో ఉన్నారు.



గురువారం రామారావు వ్యవహారంపై గవర్నర్‌కు వినతిపత్రం అందజేసిన తర్వాత ఆయనకు వివరాలు చెబుతున్న బాబు

## అవసరమైతే రామారావు అరెస్టు: సబిత

మరోవైపు రామారావు వ్యవహారంలో తమకు ఎలాంటి నివేదికా అందలేదని హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డి గురువారమిక్కడ విలేకరులకు తెలిపారు. నివేదిక అందిన తర్వాత తదనుగుణంగా చర్యలు తీసుకుంటామని, అవసరమైతే అరెస్టు చేస్తామని స్పష్టం చేశారు.